

పొగాకు వేలం కేంద్రంలో పరిశీలన

ప్రజాశక్తి-కందుకూరు: గుంటూరు పొగాకు బోర్డు కేంద్ర కార్యాలయం మేనేజర్ జి. దామోదర్, ఒంగోలు రీజనల్ మేనేజర్ ఎం. లక్ష్మణ రావు, కందుకూరు 27 వేలం కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ జరుగుతున్న పొగాకు వేలంను శుక్రవారం పరిశీలించారు. ఈ సంద్భంగా వారు మాట్లాడుతూ రైతులు జరుగుతున్న మార్కెట్‌కు అనుగుణంగా బేళ్లు తెచ్చుకోవాలని సూచించారు. బోర్డు వారు అనుమతించిన మేరకే పొగాకు సాగు చేయాలని సూచించారు.అధికంగా సాగు చేయడం వలన పొగాకు రేట్లు తగ్గి ఆర్థికంగా నష్ట పోతారన్నారు. ఎరువులు కావలసిన రైతు సోదరులు ఈ నెలాఖరులోగా బోర్డు సిబ్బందికి తెలియ పరచాలని తెలిపారు. బోర్డుకు బేళ్లు తెచ్చేటపుడు తేమ, సాఫ్ట్ లేకుండా జాగ్రత్తపడాలని తెలిపారు. ప్రతి ఒక్క రైతు విధిగా పచ్చి రొట్ట ఎరువులు సాగు చేయాలని, దీనివల్ల భూమిలో నత్రజని శాతం పెరుగుతుందని తెలిపారు.

పరిశీలిస్తున్న అధికారులు

పంటల బీమా స్వాహా..!

- 13మంది ఖాతాల్లో జమ
- రికవరీకి అధికారుల ప్రయత్నాలు

రైతులు పండించిన పంటలకు పంట బీమా కింద రావాల్సిన నగదు దారిమళ్లింది. కొందరు కింద స్థాయి అధికారుల నిర్లక్ష్యం, అవినీతి, కారణంగా రైతుల ఖాతాల్లో పడాల్సిన మొత్తం మరో వ్యక్తుల ఖాతాల్లో జమ చేశారు. విషయం బయటకు పొక్కడంతో వ్యవసాయశాఖ అధికారుల హుటాహుటీనా రికవరీకి ప్రయత్నాలు చేస్తున్నారు. ఇదంతా అనుకోకుండా జరిగిందని చెప్పుకుం టున్నారు. రైతులకు రావాల్సిన బకాయిల గురించి గగ్గోలు పెడుతుంటే పట్టించుకోని అధికారులు అసలు సంబంధం లేని వ్యక్తుల ఖాతాల్లోకి ఎలా వెళ్లిందనే విషయం ఇప్పుడు అంతుపట్టడం లేదు. ఈ సంఘటన జలదంకి మండలం, బ్రాహ్మణకాక గ్రామంలో జరిగింది. రూ.78.97 లక్షలు, రైతుల ఖాతాల్లో పడింది. 13 మంది రైతులు కాకుండా మరోవ్యక్తుల ఖాతాల్లో పడినట్లు తేలింది. రూ.17.75 లక్షలు రికవరీకి పెట్టారు. దీనిపై రైతుల్లో ఆందోళన నెలకొంది.

ప్రజాశక్తి-నెల్లూరుప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం పంటల బీమా పథకం కింద భరోసా కేంద్రాల నుంచి రైతులకు ప్రతేడాది బీమా చెల్లిస్తారు. 2022కు సంబంధించి రైతులకు బీమా అందాల్సి ఉంది. గ్రామ వ్యవసాయశాఖ అసిస్టెంట్స్ జిల్లా వ్యాపితంగా సర్వే నిర్వహించి ఈ క్రాప్ కింద పంటల సాగుకోసం అనుమతిస్తారు. రికార్డుల్లో వారికి ప్రభుత్వం నుంచి కొంత అందుతోంది. వ్యవసాయశాఖ అధికారుల పర్యవేక్షణలో సాగు తోంది. జిల్లా వ్యాపితంగా బీమా అందాల్సి ఉంటుంది. ఇక్కడే కొందరు గ్రామ స్థాయి వ్యవసాయ అధికారులు, వాలంటీర్లు చేతివాటం ప్రదర్శించినట్లు తెలుస్తోంది. జలదంకి మండలం, బ్రాహ్మణకాక గ్రామంలో 58 మంది రైతులకు ఈ పథకం కింద రూ.78 లక్షలా, 97 వేల, 420 ఖాతాల్లో వేశారు. ఇందంతా పెడింగ్‌లో ఉన్న నగదు. దీనిని రైతుల వరకే ఇచ్చి ఉండాలి. రైతులు కాకుండా ఉన్నవారికి సాగు చేయని వారి ఖాతాల్లో నగదు వెళ్లింది. ఆ నోటా, ఈనోటా పడి రైతులకు తెలియడంతో ఈ అంశం వివాదస్పద మైంది. విషయం తెలుసుకున్న వ్యవసాయ శాఖ అధికారులు హుటాహుటిన బ్రాహ్మణకాక వెళ్లి విచారణ చేపట్టారు. కొందరు కింద స్థాయి వ్యవసాయశాఖ సిబ్బంది, వలంటీర్లు, ఈ క్రాప్ కింద నమోదు చేసుకునే వ్యక్తులు కలిసి అడ్డదారిలో వెళ్లారు. 13 మంది వ్యక్తుల ఖాతాల్లో సుమారు రూ.17.75 లక్షలు జమ చేశారు. వీరు రైతులు కాదు. వ్యవసాయం చేయడం లేదు. విషయం బయటకు రావడంతో వ్యవసాయ శాఖ అధికారులు శుక్రవారం ముగ్గురు వ్యక్తుల నుంచి రికవరీ చేశారు. మిగిలిన మొత్తాన్ని రికవరీ పెట్టనున్నారు. పొరపాటున వారి ఖాతాల్లోకి వెళ్లిందని కహానీలు చెబుతున్నారు. రైతులకు ఇవ్వకుండా అనర్హులకు రైతుల బీమా కట్టబెట్టినట్లు తెలుస్తోంది. ఏమేరకు రికవరీ చేస్తారో చూడాలి.

నేడు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-గుడ్లూరు

స్థానిక కళ్యాణ మండపంలో కిమ్స్ హాస్పిటల్ నెల్లూరు వారి ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు నాగరాజు తెలిపారు. ఉచిత మెగా సూపర్ స్పెషాలిటీ వైద్య శిబిరంలో అన్ని రకాల వ్యాధులకు ఉచితంగా వైద్యం చేసి అవసరమైన మందులను అందజేస్తామని తెలిపారు. గుండె వ్యాధి నిపుణులు డాక్టర్ హెచ్ నాగరాజారావు, డాక్టర్ బి.మనుప్రసాద్ రెడ్డి, వెన్నుపూస, మెదడు వ్యాధి నిపుణులు డాక్టర్ కె ఉదయ్ కిరణ్ వారి సిబ్బంది ఈ సందర్భంగా హాజరవుతున్నట్లు తెలిపారు. మండల ప్రజలు సద్వినియోగ పరచుకోవాలని కోరారు.

హుండీ చోరీ

ప్రజాశక్తి-గుడ్లూరు

మండలంలోని కొత్తపేట గ్రామంలో ఇటీవల నూతనంగా నిర్మించిన గంగమ్మ దేవాలయంలోని హుండీ చోరీకి గురైనట్లు దేవాలయ నిర్వాహకులు పోలీస్ స్టేషన్లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. హుండీలో సుమారు 50 వేల రూపాయలు చోరీకి గురైనట్లు గ్రామస్తులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. గతంలో ఒకసారి హుండీ చోరీ గురైన దొంగలని ఇంతవరకు పట్టుకోకపోవడంతో మళ్లీ చోరీ చేసినట్లు గ్రామస్తులు తెలిపారు.

కేన్సర్ నివారణపై అవగాహన

ప్రజాశక్తి- కందుకూరు

పట్టణంలోని హాజీమల్ హుస్సేన్ ఆస్పత్రిలో ప్రతినెలా మూడవ మంగళవారం నెల్లూరు అపోలో ఆస్పత్రి వారిచే కేన్సర్ వ్యాధికి చికిత్స అందిస్తామని డాక్టర్ సి.హరిత తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ మహిళల్లో వచ్చు కేన్సర్ పై సూచనలు. సలహాలు తెలియ జేశారు. రొమ్ములో గడ్డలు, రొమ్ము నుంచి నీరు, థైరాయిడ్ గ్రంధి వాపులు, గడ్డలు వస్తాయని చెప్పారు. నోటిలో కురుపులు, పూత, మహిళల్లో అధిక రక్త స్రావం, ఆకలి లేకపోవడం, బరువు తగ్గటం కేన్సర్ లక్షణాలని పేర్కొన్నారు. మగవారిలో ధూమ పానం, ఆల్కహాల్ సేవించడం వలన కేన్సర్ బారిన పడుతున్నారని పేర్కొన్నారు. గజ్జల్లో బిళ్లలు కట్టడం, దీర్ఘకాలిక దగ్గు కేన్సర్ లక్షణాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు అజిమల్ హుస్సేన్, ఫజల్ రహీం, ఆసియా బేగం, అపోలో పిఆర్ఓ కిషోర్, ల్యాబ్ టెక్నీషియన్ సయ్యద్ ముక్తార్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డాక్టర్

ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

మణిపూర్ ఘటనపై కఠిన చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-నెల్లూరు

మణిపూర్ మహిళలపై చోటు చేసుకున్న అమానుషకాండకు సభ్య సమాజం సిగ్గుతో తలదించుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని, కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ఈ ఘటనతో సంబంధం ఉన్న వారిని కఠినంగా శిక్షించాలని సిపిఎం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. శుక్రవారం నగరంలోని సుందరయ్య భవన్ నుంచి పూలే విగ్రహం వరకు ఐద్వా మహిళల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం రిజర్వేషన్లపై అర్ధరహితమైన ప్రకటనలు చేస్తూ ప్రజల మధ్య ఘర్షణ వాతావరణం సృష్టిస్తుందన్నారు. ఈ ఘర్షణల వల్ల అనేక మంది మరణించారన్నారు. ఈ నేపథ్యంలో గడిచిన రెండు రోజుల క్రితం ఇద్దరు మహిళలపై అత్యాచారయత్నం చేయడంతోపాటు వారిని వివస్త్రలుగా చేసి నడిరోడ్డులో నడిపించారని, దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టాయన్నారు. ఈ ఘటనపై ఉన్నత న్యాయస్థానం కల్పించుకొని మీకు చేతకాకపోతే చెప్పండి రంగంలోకి మేము దిగుతాం అంటూ కేంద్ర ప్రభుత్వానికి చురకలు అంటించిందన్నారు. విధిలేని పరిస్థితుల్లో బిజెపి ప్రభుత్వం నామమాత్రపు చర్యలు చేపట్టిందన్నారు. మణిపూర్‌లో జరిగిన ఘటనకు బాధ్యత వహిస్తూ అక్కడ అధికారంలో ఉన్న ప్రభుత్వం రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు మాట్లాడుతూ గడిచిన రెండున్నర నెల నుంచి మణిపూర్‌లో మారణ హోమం అనేటటువంటిది చోటు చేసుకుందన్నారు. మణిపూర్‌లో బిజెపి ప్రభుత్వం రెండు గ్రూపుల మధ్య విభేదాలు సృష్టించి వేడుక చూస్తుందన్నారు. అనేక మంది తమ ప్రాణాలను కోల్పోగా అనేక కుటుంబాలు నిరాశ్రయులుగా మారిపోయారన్నారు. మణిపూర్‌లో వందల గ్రామాలు ఖాళీ అయ్యాయన్నారు. తమ ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకొని ఇతర ప్రాంతాలకు ప్రజలు పారిపోతున్నారన్నారు. ఈ ప్రాంతంలో ఇద్దరు మహిళలను వివస్త్రలుగా చేసి నడిరోడ్డుపై నడిపించిన ఘటన యావత్తు భారత దేశం ఉలిక్కిపడిందన్నారు. ఈ ఘటనపై దేశ ప్రధాని నరేంద్రమోడీ అర నిమిషం మాత్రమే మాట్లాడటం దారుణమన్నారు. మణిపూర్‌లో కనీస చర్యలు సైతం తీసుకోకుండా కేంద్ర ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తుందన్నారు. బిజెపి పాలనలో కుల ఘర్షణలు అధికమైపోతున్నాయన్నారు. ఇప్పటికైనా మణిపూర్‌లో చోటు చేసుకున్న ఘటనపై కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిపి ఎం జిల్లా కమిటీ సభ్యులు జి.నాగేశ్వరరావు, మూలం ప్రసాద్, ఆర్ శ్రీనివాసులు, పి.సూర్యనారాయణ, ఐద్వా నాయకులు కె పద్మ, సుబ్బమ్మ, డివైఎఫ్ఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కందుకూరు: నరేంద్ర మోడీ నాయకత్వంలోని ప్రభుత్వం భారత దేశంలో కులాల మతాల మధ్య చిచ్చు పెడుతూ భారతదేశాన్ని మరో 100 సంవత్సరాలు వెనక్కి నెడుతుందని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పి మాలకొండయ్య అన్నారు. మణిపూర్లో గిరిజన యువతులపై అత్యాచారాన్ని, అల్లర్లను నిరసిస్తూ సిపిఐ కందుకూరులో కొవ్వొత్తులతో ర్యాలీ గురువారం నిర్వహించింది. ఈ సందర్భంగా పోస్ట్ ఆఫీస్ సెంటర్లో మాలకొండయ్య మాట్లాడుతూ మణి పూర్ మంటల్లో కాలిపోతుంటే నరేంద్ర మోడీ విదేశీ పర్యటనతో తనకేమీ తెలియనట్లు వ్యవహరించటం సిగ్గుచేటన్నారు.

కొవ్వొత్తులతో ర్యాలీ

పక్కా ప్రణాళికతో బూత్ కమిటీలు

ప్రజాశక్తి-నెల్లూరు: పక్కా ప్రణాళికతో బూత్ కమిటీలు ఏర్పాటు చేసుకొని రూరల్ నియోజక వర్గంలో టిడిపి విజయానిక కృషి చేయాలని నాయకులకు, కార్యకర్తలకు రూరల్ ఎంఎల్ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పిలుపు నిచ్చారు. శుక్రవారం నగరంలోని రూరల్ ఎంఎల్ఎ కార్యాలయంలో 29, 30, 31 మరియు 34 డివిజన్ల తెలుగుదేశం పార్టీ నాయకుల, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ టిడిపి గెలుపే ప్రధాన ధ్యేయంగా పెట్టుకొని బూత్ కమిటీలను పక్కా ప్రణాళికతో నిర్మించుకుందామన్నారు. ప్రజలకు, తనకు మధ్య వారధులు బూత్ కమిటీ సభ్యులే అన్నారు. స్థానిక ప్రజలతో బూత్ కమిటీ సభ్యులు చక్కటి సమన్వయంతో వ్యవహరించాలన్నారు. రేపటి ఎన్నికలకు ప్రాణం, శ్వాస బూత్ కమిటీ సభ్యులే అన్నారు. కార్యకర్తల కష్టాలు, కనీళ్ళు అన్ని నాకు తెలుసు. నేను కూడా ఓ సాధారణ కార్యకర్త స్థాయి నుంచి వచ్చిన వాడినేన్నారు. పార్టీకి కష్టాల్లోని ప్రతి ఒక్కరికీ రూరల్లో అండగా నిలుస్తారన్నారు. ఈ కార్యక్ర మంలో టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి జెన్ని రమణయ్య, బత్తల కష్ణ, తాటి వెంకటేశ్వర రావు, సాబీర్ ఖాన్, అల్లాభక్షు, గుద్దేటి చెంచయ్య, చిన్న మస్తాన్, కూకటి హరి బాబు యాదవ్, యానాదయ్య, మమతా రెడ్డి, ఆషిక్, ఉమర్, గంగాధర్, మహేశ్వరన్, మురళి, ఖాదర్ బాషా, పల్నాటి మస్తాన్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌సి,ఎస్‌టి అత్యాచారాల నిరోధక చట్టంపై శిక్షణ

ప్రజాశక్తి-నెల్లూరు: స్థానిక అంబేద్కర్ భవన్‌లో దళిత బహుజన శ్రామిక యూనియన్, ప్రజా సంస్థల ఆధ్వర్యంలో శుక్రవారం ఎస్‌సి,ఎస్‌టి అత్యాచారాల నిరోధక చట్టంపై శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న దళిత బహుజన శ్రామిక యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి చిట్టిబాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌సి,ఎస్‌టి అత్యాచారాల నిరోధక చట్టం సక్రమంగా అమలు కావడం లేదని, రాష్ట్రంలో రోజురోజుకు అత్యాచారాలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం సక్రమ అమలుకు ఏర్పాటు చేయబడిన విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీలు కలెక్టర్ పబ్లిక్ ప్రాసెక్యూటర్ తో చేయాల్సిన రివ్యూలు రూల్ 12 నాలుగు ప్రకారం బాధితులకు ఏడు రోజులలో అందాల్సిన తక్షణ సహాయము అందడం లేదన్నారు. కేసు నమోదైన 60 రోజుల్లోనే ఛార్జీ షీట్ దాఖాలు చేయకపోవడం వల్ల బాధితులకు తీవ్ర నష్టం చేకూరుతుందన్నారు. సెక్షన్ 15లో బాధితులకు సాక్షులకు ప్రత్యేకమైన హక్కులు ఇవ్వబడ్డాయని వారికి ఉచితంగా ఎఫ్ఐఆర్ చార్జ్ షీట్ కాపీలు అందించాలని, ఫిర్యాదు అందిన వెంటనే పోలీసులు కేసు నమోదు చేయాలని, సంబంధిత సెక్షన్లు వేయాలని నిర్దేశించిందన్నారు. ఈ చట్టం సక్రమ అమల అయ్యేందుకు పౌర సమాజం అవగాహన పెంచుకోవడంతో పాటు ప్రజా పర్యవేక్షణ కమిటీలను రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ పివి రమణయ్య అధ్యక్షతన జరగగా జిల్లా ఎస్‌సి,ఎస్‌టి విజిలెన్స్ అండ్ మోనిటర్ కమిటీ సభ్యులు కె రఘుబాబు, కెసి పెంచలయ్య, దళిత నాయకులు డి.కృష్ణ , ఎన్‌వి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

మొబైల్ వ్యాన్లు పంపిణీ

ప్రజాశక్తి-నెల్లూరు: మత్స్యకార కుటుంబాల స్వయం ఉపాధి మరింత మెరుగుపడేలా రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీతో నూతన ఫిష్ ఆంధ్ర మొబైల్ వ్యాన్లను అందిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ ఆర్. కుర్మనాథ్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ ఆవరణలో జాయింట్ కలెక్టర్ ఆర్. కుర్మనాథ్, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్ బాబు రెడ్డి, మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్ నాగేశ్వరరావులతో కలసి ఒక్కొక్కటి రూ.4.62 లక్షల విలువ గల రెండు ఫిష్ ఆంధ్ర మొబైల్ వ్యాన్లను అందజేశారు. ఈ వ్యాన్లను మత్స్యకార లబ్ధిదారులైన కోవూరు మండలం, పెద్ద పడుగుపాడుకు చెందిన ఎస్. రాఘవేంద్ర, సైదాపురం కు చెందిన కె. అనంతయ్య లకు అందించారు. ఇందులో 1.80 లక్షల రూపాయలు సబ్సిడీ కాగా, లబ్దిదారుని వాటా 2.82 రూపాయలు. ఈ సందర్భంగా ఫిష్ ఆంధ్ర మొబైల్ వ్యాన్ల పని తీరును మత్స్య శాఖ జెడి నాగేశ్వరరావు, జాయింట్ కలెక్టర్ కు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖాధికారి సుధాకర్ రాజు, మత్స్యకారులు పాల్గొన్నారు.,

చేనేత కార్మికులకు లబ్ధి

ప్రజాశక్తి-నెల్లూరు: జిల్లాలో "వైఎస్సార్ నేతన్న నేస్తం" పథకం ద్వారా 2023-24 సంవత్సరానికి గాను 3,966 మంది చేనేత కార్మిక లబ్ధిదారులకు సంవత్సరానికి 24 వేల రూపాయల చొప్పున రూ. 9,51,84,000/- లు వారి ఖాతాలకు జమ చేయడం జరిగిందని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్. కూర్మనాథ్ పేర్కొన్నారు. శుక్రవారం 5వ విడత వైఎస్ఆర్ నేతన్న నేస్తంను రాష్ట్ర వ్యాప్తంగా 80,686 మంది నేతన్నలకు రూ.193.64 కోట్లను తిరుపతి జిల్లా, వెంకటగిరి సభ నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. స్థానిక కలెక్టరేట్ లోని తిక్కన ప్రాంగణంలో ఏర్పాటుచేసిన జిల్లా స్థాయి కార్యక్రమానికి జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్. కూర్మనాథ్, చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకులు ఆనంద కుమార్, తొగటవీర క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ ఎం. ఆదిలక్ష్మి, చేనేత కార్మిక సంఘాల ప్రతినిధులు, కార్మి కులు తదితరులు హాజరయ్యారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఆర్. కూర్మనాథ్, తొగటవీర క్షత్రియ కొర్పోరేషన్ ఛైర్మన్ ఎం. ఆదిలక్ష్మి, చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకులు ఆనంద కుమార్ లతో కలసి వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం కింద జిల్లా లోని 3,966 మంది చేనేత కార్మిక లబ్దిదారులకు రూ. 9,51,84,000/- ల మెగా చెక్కును అందజేశారు.చేనేత కార్మికులకు ఆర్థిక సహాయం చేసే కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి తిరుపతి జిల్లా వెంకటగిరి నుంచి ప్రారంభించారన్నారు.

చెక్కు అందజేస్తున్న దృశ్యం

విఆర్‌ఎల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-కందుకూరు: స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద రెండవ రోజూ శుక్రవారం విఆర్‌ఎల ధర్నా జరిగింది. ఈ కార్యక్రమానికి విఆర్ఎ మండల అధ్యక్షులు జె రామయ్య అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా సిఐటియు నాయకులు ఎస్‌ఎ గౌస్ మాట్లాడుతూ తక్షణమే విఆర్‌ఎల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వం వెంటనే విఆర్‌ఎల నాయకత్వాన్ని చర్చలకు పిలిచి మాట్లాడాలన్నారు.కార్యక్రమంలో విఆర్‌ఎల మండల కార్యదర్శి జి.రమేష్, జె.రత్నం, ఎస్.కె కాలేషా, టి.సురేష్ మండల విఆర్‌ఎలు పాల్గొన్నారు.

దీక్షలో పాల్గొన్నవిఆర్‌ఎలు

మృతుడి కుటుంబానికి రూ.15లక్షలు పరిహారం ఇవ్వాలి

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి: మనుబోలు మండలం, వడ్లపూడి గ్రామం కోసూరు హరేంద్ర కల్లుగీత కార్మికుడు సొసైటీలో నెంబరు. చెట్టుపై నుంచి కల్లుగీసి కిందకు వస్తుండగా గుండె పోటు రావడంతో అక్కడికక్కడే మృతి చెందిన విషయం విధితమే.. పెద్ద దిక్కుగా ఉన్న ఆయన మృతిచెందడంతో కుటుంబం ఇబ్బందుల్లో పడింది. ప్రభుత్వం రూ.15 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని ఎపి చేతివత్తుదారుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ కటికల వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు గుంజి దయాకర్, కెవిపిఎస్ మండల నాయకులు బి.చెంచు భాస్కర్, రైతు సంఘం నాయకులు టి.దేవదానం డిమాండ్ చేశారు. అనంతరం మృతుని కుటుంబాన్ని వారు పరామర్శించారు.

లబ్ధిదారులకు టిడ్కో గృహాలు ఇవ్వాలి

ప్రజాశక్తి-నెల్లూరు: నగరపాలక సంస్థ పరిధిలో వివిధ కేటగిరీలలో కేటాయించబడిన ఆంధ్రప్రదేశ్ టిడ్కో గహాలకు సంబంధించి రిజిస్ట్రేషన్ ప్రక్రియ వివిధ కారణాల రీత్యా రిజెక్ట్ అయిన గహాలను పేపరు ప్రకటన ద్వారా నూతన లబ్ధిదారులకు అందజేయాలని కమిషనర్ వికాస్ మర్మత్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం వారు నిర్దేశించిన జిఒ ఆర్‌టి నెంబరు.429 అనుసరించి నగరపాలక సంస్థ కార్యాలయంలోని ఎ.పి.జె.అబ్దుల్ కలాం సమావేశ మందిరంలో మెప్మా, టిడ్కో విభాగం అధికారులతో సమీక్షా సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. సమావేశంలో మెప్మా పీడీ. రవీంద్ర, ఎల్.డిఎం. ప్రదీప్ కుమార్, హౌసింగ్ సిద్దిక్, హౌసింగ్ కో ఆర్డినేటర్ రామసుబ్బయ్య, సి. పెంచలయ్య, జరీనా, హౌసింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయాల్లో తనిఖీ

ప్రజాశక్తి-నెల్లూరు : నగర పాలక సంస్థ పరిధిలోని స్థానిక 22/1, 22/4 మదర్ థెరీసా వీధి, వేదాయపాలెం సచివాలయాలను కమిషనర్ వికాస్ మర్మత్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయాలలోని ఇన్వెక్షన్ రిజిష్టరు, నోటీసు బోర్డు, హాజరు రిజిస్టరు, స్పందన రిజిష్టరులతో పాటు వివిధ సంక్షేమ పథకాల రికార్డులను పరిశీలించారు. జగనన్న సురక్ష పథకం పారదర్శకంగా అందరికీ చేరువయ్యేలా సచివాలయం సెక్రటరీలు కషి చేయాలన్నారు. చిన్న పిల్లలకు ఆధార్ నమోదు, జనన ధ్రువీకరణ పత్రాల మంజూరు వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించి సంబంధిత పత్రాలను సురక్ష కార్యక్రమంలో అందజేయా లన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ విజయ్ భాస్కర్ రెడ్డి, నగర పాలక సంస్థ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కమిషనర్

పాఠశాలలో ఎంఇఒ పరిశీలన

ప్రజాశక్తి-ఉలవపాడు: మండలంలోని రాజుపాలెం ఎస్‌సి పాఠశాలను ఎంఇఒ ప్రసాదరావు శుక్రవారం సందర్శిం చారు. అక్కడ నాడు నేడు పనులు ఆగి పోయినందున ఎందువలన ఆగిపోయిందో ఆ పాఠశాల ఉపాధ్యాయినిని అడిగి తెలు సుకున్నారు. నాడు-నేడు సంబం ధించిన మెటీరియల్ ఆ పాఠశాలలో కొని ఉంచారు. మిగిలిన డబ్బుతో ఏ పనులు చేయించాలో తెలియ జేశారు. రామకష్ణాపురం ఎస్టీ పాఠశాలను ప్రార్థనా సమయంలో సందర్శిం చారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు జగనన్న విద్యా కానుకలు అందాయో లేదో తెలుసు కున్నారు పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులు ఎలా చదువుతున్నారో తెలుసుకున్నారు.

కోటేశ్వరరావుకు సన్మానం

ప్రజాశక్తి-ఉలవపాడు: శాఖా గ్రంథాలయంలో జరిగిన వేసవి శిక్షణ తరగతులలో ఎక్కువ మంది విద్యార్థులను గ్రంథాలయానికి ఆహ్వానించి పిల్లల్లో దాగివున్న సజనాత్మక శక్తిని వెలికితీసే క్రమంలో 35 రోజుల పాటు పిల్లలకు వివిధ సాంస్కతిక కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. 50 మంది విద్యార్థులను గ్రంథాలయ సభ్యులుగా చేర్పించిన కారణంగా ప్రకాశం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ రాచగొర్ల వెంకట సుశీల ,వారి భర్త పిచ్చయ్య యాదవ్ సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి శుక్రవారం ఒంగోలు కార్యాలయంలో జరిగిన రివ్యూ సమావేశంలో గ్రంథపాలకుడు దాసరి కోటేశ్వరరావుని సన్మానించారు. ఈ సన్మానానికి కారకులైన ఉలవపాడు ఎలక్ట్రానిక్ ప్రింట్ మీడియా మిత్రులకు, గ్రామంలో సహకరించిన విద్యార్థుల తల్లిదండ్రులకు, ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.


సన్మానిస్తున్న దృశ్యం

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి-నెల్లూరు: నగర పాలక సంస్థ పరిధిలో స్పందన వేదిక ద్వారా అందుకున్న ప్రజా సమస్యల పరిష్కారానికి కమిషనర్ వికాస్ మర్మత్ క్షేత్ర స్థాయిలో పర్యటించారు. స్థానిక కొత్తూరు, రామకోటయ్య నగర్, పరమేశ్వరి నగర్, రెడ్ క్రాస్ భవనం సమీపంలో ప్రాంతాలకు సంభందించి "జగనన్నకు చెబుదాం", స్పందన ఫిర్యాదులను కమిషనర్ అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఫిర్యాదులకు శాశ్వత పరిష్కారం అందించి పునరావతం కాకుండా చర్యలు తీసుకోవాలని టౌన్ ప్లానింగ్ అధికా రులను కమిషనర్ ఆదేశించారు.ఈ కార్యక్ర మంలో నగర పాలక సంస్థ టౌన్ ప్లానింగ్ అధికారులు దేవి కుమారి, దశయ్య, దేవేంద్ర, ప్రకాష్ సిబ్బంది పాల్గొన్నారు.

చిల్డ్రన్స్ పార్కు పనులు వేగవంతం

ప్రజాశక్తి-నెల్లూరు: నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చిన్న పిల్లల పార్కులో జరుగుతున్న ఆధునికీకరణ పనులను వేగవంతం చేయాలని కమిషనర్ వికాస్ మర్మత్ అధికారులను ఆదేశించారు. నగర పాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగం అధికారులతో కలిసి స్థానిక చిల్డ్రన్స్ పార్కులో జరుగుతోన్న పనులను కమిషనర్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పార్కులోని చిన్న పిల్లల ఆటవిడుపు వస్తువులు, వివిధ రకాల ప్లే గ్రౌండ్స్, పచ్చదనాన్ని పెంపొందించే మొక్కలు, వాకింగ్ ట్రాక్, వ్యాయమ ఉపకరణాలు, స్విమ్మింగ్ పూల్, మంచి నీటి సౌకర్యాలు, బెంచ్‌ల ఏర్పాటు, విద్యుత్ దీపాలు, సెక్యూరిటీ విభాగం, తినుబండారాల షాపులు తదితర అంశాలను పరిశీలించారు. పార్కులోని సందర్శకులతో కమిషనర్ ప్రత్యక్షంగా మాట్లాడి అవసరమైన సదుపాయాల గురించి విచారించారు. అన్ని వయసుల ప్రజలు పార్కును ప్రతిరోజూ సందర్శించి ఆటవిడుపు పొందేలా అన్ని వసతులను కల్పించనున్నామని, అభివద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేసి పార్కును త్వరలో సందర్శకులకు అందుబాటులో తేనున్నామని వెల్లడించారు. అనంతరం స్థానిక పాత మున్సిపల్ కార్యాలయంలో జరుగుతున్న నైట్ షెల్టర్ పనులను కమిషనర్ మెప్మా పి.డి రవీంద్ర తో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ విభాగం ఎస్.ఇ సంపత్ కుమార్, ఇఇ సంజయ్, డి.ఇఇ, ఎఇలు, సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న కమిషనర్

పాత నేరస్తుల కదలికలపై నిఘా

ప్రజాశక్తి-నెల్లూరు

రౌడీలు, అనుమానితులు, పాత నేరస్తుల కదలికలపై పోలీసులు గట్టి నిఘా ఉంచి, తరచుగా కౌన్సెలింగ్ నిర్వహించి వారిలో పరివర్తనకు గట్టిగా కషి చేయాలని ఎస్‌పి డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి పిలుపు నిచ్చారు. శుక్రవారం స్థానిక ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా పోలీసు అధికారులతో నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో చోటు చేసుకున్న గ్రేవ్, నాన్ గ్రేవ్, అస్తి సంబంధిత నేరాలలో విచారణ గురించి సర్కిల్ వారీగా అధికారులతో సమీక్ష నిర్వహించారు. కోర్టు పరిధిలోని అంశాలను పరిగణనలోకి తీసుకుని ఎప్పటికప్పుడు పరిష్కరించాలని పోలీసు అధికారులకు సూచించారు. ముఖ్యంగా ప్రశాంత వాతవరణానికి భంగం కలిగించే పేకాట, కోడిపందేలు నివారణకు గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్న ట్రిపుల్ రైడింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్ వంటి వాటిని సమర్థవంతంగా ఎదుర్కోవాలన్నారు. దిశ కాల్స్, 112, డయల్ 100 వంటి అత్యసర నెంబర్ల నుంచి వచ్చు కాల్స్ కు , ఎన్‌హెచ్‌ఆర్‌సి, ఎస్‌హెచ్‌ఆర్‌షి ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యతతో తక్షణం స్పందించాలన్నారు. జిల్లాలోని పలు పోలీసు స్టేషన్ల పరిధిలో విచారణ దశలోని కేసులను సాంకేతిక పరిజ్ఞాన్ని, వత్తి నైపుణ్యాన్ని ఉపయోగించి వేగవంతంగా దర్యాప్తుచేసి సంబంధిత కోర్టులో ఛార్జి షీట్ దాఖాలు చేయాలన్నారు. యాసిడ్, బాణసంచా మందు గుండు సామగ్రి తయారీ కేంద్రాలకు, వాటిని నిల్వ ఉంచే గోడౌన్లకు తప్పనిసరిగా ప్రభుత్వ అనుమతులు ఉండాలని, పోలీస్ అధికారులు వాటిని సందర్శించి ప్రభుత్వ నియమ నిబంధనలు పాటించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం జిల్లాలో పెండింగ్‌లోని గ్రేవ్ ,నాన్ గ్రేవ్ కేసులు, హత్య కేసులు, ఫోస్కో, రేప్ కేసులు, డెకాయిటి, రాబరీ, ప్రాపర్టీ, వాహనాలు దొంగతనం, మిస్సింగ్, చీటింగ్ కేసులు, ప్రాపర్టీ కేసులు, రోడ్డు ప్రమాదాలు, 174 క్రైం పిసి కేసులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ వర్క్, డిపిఒకు సంబంధించి పెండింగ్ రిప్లై ఫైల్స్, పెండింగ్ ఎన్‌బిడబ్ల్యూ ఎస్, ఎన్‌డిపిఎస్ కేసులలో దర్యాప్తు, రికవరీల గురించి సర్కిల్ వారీగా పోలీస్ అధికారులతో సమీక్ష నిర్వహించి, సిడి ఫైల్స్ క్షుణ్ణంగా పరిశీలించారు. గత మాసంలో ప్రతిభ కనబరిచిన అధికారులకు, సిబ్బందికి ప్రశంసా పత్రాలను అందించి అభినందించారు.

మాట్లాడుతున్న ఎస్‌పి తిరుమలేశ్వరరెడ్డి

ఐద్వా నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-ఆత్మకూరుఅర్బన్ : పట్టణంలోని అరుంధతీయవాడ శాఖ రెండవ శాఖ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఐద్వా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు షేక్ మస్తాన్‌బీ, టి.శివకుమారీలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను 50శాతం రిజర్వేషన్లు విద్య, ఉపాధి మరిన్ని పోరాటాలు నిర్వహించేందుకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఐద్వా కార్యదర్శిగా కొండామణి, అధ్యక్షురాలు పేమల సుబ్బమ్మ, ఉపాధ్యక్షురాలు పేమల శైలజలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పట్టణ ఐద్వా నాయకులు షేక్ గుల్జార్ బేగం, కొండా లక్ష్మమ్మ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పొగాకు బోర్డులో పరిశీలన

ప్రజాశక్తి-మర్రిపాడు : మండలంలోని డిసిపల్లి పొగాకు బోర్డును మేనేజర్ (ఎక్స్‌టెన్షన్) దామోదర్ శుక్రవారం సందర్శించారు. అనంతరం పొగాకు వేలం ప్రక్రియను, ధరలను పరిశీలించి రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలుగా పొగాకు పంట రైతులకు మంచి ఆదాయాన్ని ఇస్తుందని, దానివల్ల రైతులు వచ్చే సంవత్సరంలో అధిక ధరలకు పొగాకు బ్యారెన్లు, పొలాలు లీజుకు తీసుకుంటున్నారన్నారు. అందువల్ల ఖర్చులు బాగా పెరిగి నష్టాలు వచ్చే అవకాశం ఉందని, రైతులు పొగాకు బోర్డు అనుమతించిన మేరకే పొగాకు పండించాలన్నారు. ఎక్కువగా పొగాకు పంటని పండించడం వల్ల డిమాండ్ తగ్గి నష్టాలు వచ్చే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో పొగాకుబోర్డు వేలంనిర్వహణాధికారి జి.రాజశేఖర్, తదితరులున్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి-మర్రిపాడు : మండలంలోని ఇర్లపాడు ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేసి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు మంజులా కుమారి, ప్రమీల, ప్రకాశం శ్రీనివాసులు, పెంచల రెడ్డి, భారతి, రవిలను పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఇర్లపాడు సర్పంచ్ శ్రీనివాసులు మాట్లాడుతూ బదిలీ పొందిన ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించారని, పాఠశాల అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో ఎంఆర్‌జి రాజేంద్రకుమార్, ప్రధానోపాధ్యాయుడు బ్రహ్మయ్య, మాజీ సర్పంచ్ పెంచలయ్య, గురం నాగేశ్వరరావు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ సుబ్బరాయుడు, ఉపాధ్యాయులు రమేష్, సుధాకర్, మౌనిక, మరియమ్మ, తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో వరి విత్తనాలు

ప్రజాశక్తి-ఉదయగిరి : బిపిటి - 5204 పునాది విత్తనం వరి విత్తనం అందుబాటులో ఉన్నాయని కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ జి.లలిత శివజ్యోతి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, కృషి విజ్ఞాన కేంద్రం, నెల్లూరులో ఈ బి.పి.టి - 5204 పునాది విత్తనం వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అవసరమయ్యే రైతులు 25 కేజీల బస్తా రూ.1000 విత్తనం కొనుగోలు చేయవచ్చన్నారు. పూర్తి సమాచారం కోసం 7981644675 నెంబరును సంప్రదించాలని ఆమె కోరారు.

ట్రై సైకిల్ అందజేత

ప్రజాశక్తి-కావలి : యువగళం పాదయాత్రలో భాగంగా కావలిలో లోకేష్‌బాబు పర్యటిస్తున్నపుడు 31వ వార్డుకు చెందిన వేమిలి వెంకయ్యకు ఇచ్చిన మాట ప్రకారం కావలి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ మాలేపాటి సుబ్బానాయుడు శుక్రవారం ట్రైసైకిల్‌ను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నడుము పాదయాత్రలో ఉన్న లోకేష్‌బాబును విరిగిపోయి నడవలేని పరిస్థితుల్లో ఇబ్బంది పడుతూ కలిసిందన్నారు. తన దీన పరిస్థితిని వివరిస్తూ, పెన్షన్ తొలగించారని అనారోగ్యంతో నడవలేక బాధపడుతున్నానని అభ్యర్థించిందని తెలిపారు. ఈ మేరకు ఆయన ఇచ్చిన మాటకు ట్రైసైకిల్ పంపారన్నారు. అందుకు వెంకయ్య తనకు సహాయం చేసిన లోకేష్‌బాబుకు, మాలేపాటి సుబ్బానాయుడికి, వార్డు ముఖ్య నాయకులైన మంచాల ప్రసాద్‌కు ఇతర టిడిపి పార్టీ శ్రేణులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

మహిళా నేతలతో సమీక్ష

ప్రజాశక్తి-కావలి : కావలి టిడిపి కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గ ఇన్‌ఛార్జి మాలేపాటి సుబ్బానాయుడు పార్టీ మహిళా నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాలేపాటి మాట్లాడుతూ మహిళలు పార్టీ బలోపేతానికి మహాశక్తిగా మారి, ప్రజల్లో పార్టీపై నమ్మకం కలిగేలా చేయాలని సూచించారు. సమావేశంలో పట్టణ మహిళా విభాగం అధ్యక్షురాలు ద్రోణాదుల వసంతి, రూరల్ మండల మహిళా విభాగం అధ్యక్షురాలు వాయిల రుక్మిణమ్మ, మహిళా నేతలు కొల్లూరు అశ్విని, అమర జ్యోతి, కట్టమూరు శ్రీదేవి, శ్రీలక్ష్మి, రాధమ్మ, సుప్రజ, హసీనా తదితరులు పాల్గొన్నారు.

జువ్వలదిన్నెలో 'జగనన్న సురక్ష'

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండలం జువ్వలదిన్నె గ్రామ సచివాలయంలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమం ఎంపిడిఒ వెంకట సుబ్బారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కావలి ఆర్‌డిఒ శీనానాయక్ పాల్గొని అర్జీదారులకు సర్టిఫికెట్లను అందజేశారు. వైసిపి జిల్లా సెక్రెటరీ మద్దిబోయిన వీరయ్య, డిప్యూటీ తహశీల్దార్ వెంకటేశ్వర్లు, సీఆర్‌డిఏ సెక్రెటరీ గిరిబాబు, జువ్వలదిన్నె సర్పంచ్ మామిడి అంకమ్మ, మత్స్యకార నాయకులు మిడి గోవింద, తదితరులున్నారు.

పవన్‌కళ్యాణ్‌పై వ్యక్తిగత దూషణ తగదు

ప్రజాశక్తి-కావలి : పవన్ కళ్యాణ్‌పై ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వ్యక్తిగత దూషణకు దిగడం తగదని పవన్‌కళ్యాణ్ ఫ్యాన్స్ అధ్యక్షుడు ఆలా శ్రీనాథ్ ఖండించారు. శుక్రవారం దండావారి వీధిలో చిరంజీవి, పవన్‌కళ్యాణ్ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో పత్రికా విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలా శ్రీనాథ్ మాట్లాడుతూ "వారాహి" విజయోత్సవ యాత్రలో భాగంగా ఏలూరులో జరిగిన సభలో తమ నాయకుడు పవన్‌కళ్యాణ్ మాట్లాడుతూ వాలంటీర్ వ్యవస్థలో జరుగుతున్న అక్రమాలు గురించి మాట్లాడారన్నారు. అందులో వ్యక్తిగత సమాచారం చోర్యానికి గురౌతుందన్నారు. ఈ సమాచారం తెలంగాణాలోని ఒక సంస్థ చేరుతుందన్నారు. ఈ వాలంటీర్లకు చదివిన చదువుకు, ఇచ్చే వేతనానికి సంబంధం లేదన్నారు. రాబోవు ఎన్నికల్లో జగన్‌మోహన్ రెడ్డికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో చిరంజీవి ఫ్యాన్స్ అధ్యక్షుడు చింతల వెంకటయ్య, జనసేన నాయకులు మన్నెపల్లి రిషికేష్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-సంగం : సంగంలో జనసేన పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కృష్ణారెడ్డి, పవన్ కళ్యాణ్‌ఫ్యాన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హరికుమార్‌రెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెంకటగిరిలో నేతన్న నేస్తం కార్యక్రమంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్‌పై చేసిన దిగజారుడు వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : వెంకటగిరిలో జరిగిన నేతన్న నేస్తం కార్యక్రమంలో జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌పై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిగజారుడు వ్యాఖ్యలు చేశారని, ఆ వ్యాఖ్యలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని జనసేన పార్టీ ఆత్మకూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ నలిశెట్టి శ్రీధర్ అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికలపై అవగాహన

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి : నగరంలోని 11వ డివిజన్ సరస్వతి నగర్ ఓవెల్ మోడ్రన్ పాఠశాలలో శుక్రవారం కేబినెట్ ఎలక్షన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిఎం మహదేవ్, డిజిఎం శ్రీనివాస్ పాల్గొని భారత దేశ ఎన్నికల వ్యవస్థను గురించి వివరించారు. ఎన్నికలపై పిల్లలకు అవగాహన కల్పించారు. పాఠశాల ప్రిన్సిపల్ యు.రమణయ్య నాయుడు, ప్రైమరీ స్కూల్ ఇన్‌ఛార్జ్ రమాదేవి, హైస్కూల్ ఇన్‌ఛార్జ్ ప్రసాద్ రెడ్డి, ఎఒ సునీల్ పాల్గొన్నారు.

రేపు టిడిపి కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి-పొదలకూరు : పట్టణంలోని నరసారెడ్డికాలనీ పాత ఫైర్ ఆఫీస్ వీధిలో మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని ఆదివారం ప్రారంభిస్తున్నట్లు మండల అధ్యక్షులు తెలుగు మస్తాన్ బాబు, పట్టణ అధ్యక్షుడు బొద్దులూరు మల్లికార్జున నాయుడు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి, టిడిపి జాతీయ పొలిట్ బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పాల్గొంటారని తెలిపారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు, ఎన్టీఆర్ అభిమానులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

23న చలో విజయవాడ

ప్రజాశక్తి-నెల్లూరు : ఎస్‌సి, ఎస్‌టి, ఓబిసి, ఉద్యోగ, ఉపాధ్యాయ, ఆఫీసర్స్ జెఏసి ఆధ్వర్యంలో 23వ విజయవాడలో తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ జిల్లా కమిటీ పిలుపు నిచ్చింది. రాజ్యాంగం కల్పించిన ప్రమోషన్లలో రిజర్వేషన్లను రాష్ట్ర ప్రభుత్వం తూట్లు పొడిచే కార్యక్రమానికి పూనుకున్న దరిమిలా ఆ హక్కులను రక్షించుకోవడం కోసం జరిగే చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

కొనసాగుతున్న విఆర్ఎల నిరసన దీక్ష

మాట్లాడుతున్న పెంచల నర్సయ్య

ప్రజాశక్తి-కోవూరు : కోవూరు తహశీల్దార్ కార్యాలయం వద్ద గ్రామ రెవెన్యూ సహాయకులు విఆర్ఎల సమస్యలు పరిష్కారం చేయాలని రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా రెండవ రోజు రిలే దీక్షలు నిర్వహించారు. జిల్లా గౌరవ అధ్యక్షులు కె.పెంచల నరసయ్య మాట్లాడుతూ గ్రామ రెవెన్యూ సహాయకులు తమ ఉద్యోగ బాధ్యతలతో పాటు పలు శాఖల పనులు చేస్తున్నారని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి తాను అధికారంలోకి వచ్చిన 6 నెలలలోపు విఆర్ఎల సమస్యలు పరిష్కారం చేస్తామని, వేతనాలు పెంచుతామని హామీనిచ్చారని తెలిపారు. హామీ నిచ్చి నాలుగున్నర సంవత్సరాలు పూర్తి కావస్తున్నా ఏ ఒక్క సమస్య కూడా పరిష్కారం చేయలేదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి విఆర్ఎల సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనకు సిద్ధపడతామని తెలియజేశారు. కార్యక్రమంలో విఆర్ఏ మండల నాయకులు గుణం నాగార్జున, సిఐటియు నాయకులు శేషయ్య, ఎస్.కె బాబు, చాన్‌బాషా, విఆర్ఎలు పి.అశోక్, నీరజ, వెంకట రమణమ్మ, చిన్న వెంకయ్య, పవన్, సంజీవయ్య, సురేష్, సుమంత్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఇందుకూరుపేట : రాష్ట్ర రెవెన్యూ సహాయ సేవకుల సంఘం పిలుపుమేరకు తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం చేయాలని కోరుతూ తహశీల్దార్ కార్యాలయం వద్ద గ్రామ సహాయకులు శుక్రవారం నిరసన దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమంలో ముందుగా ఇందుకూరుపేట గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు వి.భాస్కర్, ఎస్‌కె.జలీల్‌బాషా మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉండగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి తమ సమస్యలు పరిష్కరిస్తామని హామీనిచ్చారు. కానీ ఇప్పుడు అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు గడుస్తున్నా సంవత్సరాలు పూర్తవుతున్నా తమ సమస్యలు పరిష్కరించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు మారుబోయిన రాజా, విఆర్ఎల సంఘం ట్రెజరర్ షామీమా, వై.సుమలత, సిపిఎం మండల కార్యదర్శి కోటేశ్వరావు, సిఐటియు మండల గౌరవ అధ్యక్షులు చాన్‌బాషా, ఆటో యూనియన్ అధ్యక్షులు దయాసాగర్, కౌలు రైతు సంఘం నాయకులు వెన్నువేణు, ఇందుకూరుపేట శాఖ కార్యదర్శి కోనేటి వెంకయ్య, తదితరులున్నారు.

ప్రజాశక్తి-ఉదయగిరి : రెండు రోజులుగా జరుగుతున్న విఆర్ఎల దీక్షలు శుక్రవారంతో ముగిశాయని సిఐటియు నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విఆర్ఎ సంఘం నాయకులు కాకు వెంకటయ్య మాట్లాడుతూ విఆర్ఎల సమస్యలు తక్షణమే పరిష్కరించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూలో విధులు నిర్వహిస్తున్న విఆర్ఎలకు పనికి తగ్గట్టు వేతనం అందించి వారికి అండగా నిలవాలన్నారు. ముఖ్యమంత్రి పాదయాత్రలో ఇచ్చిన హామీనే అడుగుతున్నారని వారి సేవలను గుర్తించి వారికి ఉద్యోగ భద్రత కల్పిస్తూ సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు వేతనం అందించాలన్నారు. ఆగస్టు 7, 8వ తేదీల్లో జిల్లా కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నాకు అధిక సంఖ్యలో విఆర్ఎలు అధిక సంఖ్యలో పాల్గొని జరిగే దీక్షను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో అధ్యక్షులు దుర్గయ్య, అరబ్, శ్రీనివాసులు, పురుషోత్తం, పిచ్చయ్య, అన్ని పంచాయతీల విఆర్ఎలు పాల్గొన్నారు.

'మణిపూర్' నిందితులను కఠినంగా శిక్షించాలి

నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న ఐద్వా నాయకులు

ప్రజాశక్తి-ఆత్మకూరుఅర్బన్

మణిపూర్ రాష్ట్రంలో గిరిజన తెగలుపై హింసను అరికట్టాలని, మహిళలపై చేస్తున్న అరాచక శక్తులను వెంటనే అరెస్టు చేసి, కఠినంగా శిక్షించి, మహిళలకు న్యాయం చేయాలని ఐద్వా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు షేక్.మస్తాన్‌బీ, టి.శివకుమారీలు పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆత్మకూరు పట్టణంలోని పురవీధుల్లో నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఆత్మకూరు టౌన్ కమిటీ ఆధ్వర్యంలో మణిపూర్‌లో మహిళలపై జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా గత 79 రోజులుగా మణిపూర్‌లో మారనకాండ జరుగుతుందన్నారు. కేంద్రంలోనూ రాష్ట్రంలో బిజెపి పాలన ఉందని, అయినా ఈ ఘటన జరగడం అన్యాయమన్నారు. మణిపూర్ రాష్ట్రంలో 60 మంది ఎంఎల్ఎలు ఉంటే వారిలో 40 మంది బిజెపి శాసనసభ్యులున్నారని, ఇప్పటివరకు కూడా ప్రధానమంత్రి మోడీ మణిపూర్ ఘటనపై నోరు విప్పికపోవడంపై బాధాకరంగా ఉందన్నారు. భేటీ బచావో - భేటీ పడావో అనే నినాదం ఎక్కడికి వెళ్లిందని ప్రశ్నించారు. భారతదేశానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ విదేశీ ప్రయాణానికి కేటాయిస్తున్నాడే గానీ భారతదేశంలో మహిళలపై ఎటువంటి ఘటనలపై ఖండించకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో ఆత్మకూరు ఐద్వా నాయకురాలు గుల్జార్ బేగం, కొండా లక్ష్మమ్మ, కొండామణి, సుబ్బమ్మ, శైలజా, పద్మ తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనను ఖండించాలి
- కావలి ఉమెన్స్‌ఫోర్స్ పిలుపు

ప్రజాశక్తి-కావలి : మణిపూర్ ఘటనను సభ్యసమాజం తీవ్రంగా నిరసించాలని కావలి ఉమెన్స్ ఫోర్స్ ప్రకటనలో పిలుపునిచ్చింది. శుక్రవారం ఫోర్స్ కన్వీనర్ చాకలకొండ శారద మాట్లాడుతూ భారతీయ మహిళల మాన ప్రాణాలు బిజెపి ప్రభుత్వ హయాంలో బజారు పాలయ్యాయని తెలిపారు. ఈ దుర్ఘటన వెలుగు చూడడానికి 80 రోజులు పట్టిందన్నారు. ఇది భారతమాతనే మానభంగం చేసినట్లే భావించదగిన దుశ్చర్య అని పేర్కొన్నారు. ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించి, పొలాల్లో వందకు మందికిపైగా మృగాళ్లు పైనబడి అత్యంత దారుణంగా అత్యాచారం చేయడాన్ని జీర్ణించుకోలేని ప్రతిఒక్క మనిషి, సంస్థ, రాజకీయపార్టీ, ప్రజాసంఘాలు, వామపక్షాలు, మహిళాసంఘాల ప్రమేయం లేకుండా కూడా ఆగ్రహాన్ని నిరసనల ద్వారా, మీడియాల ద్వారా వ్యక్తం చేయాలని పిలుపునిచ్చారు.

గ్రామస్థాయి పాలనతో అభివృద్ధి : కలెక్టర్

ప్రజాశక్తి-ఇందుకూరుపేట : గ్రామస్థాయి పాలనతో జాతీయస్థాయిలో అభివృద్ధి వేగంగా చెందుతుందని జిల్లా కలెక్టర్ హరి నారాయణన్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని పున్నూరు గ్రామంలో సచివాలయ బిల్డింగ్, సిమెంట్ రోడ్ల ప్రారంభోత్సవాలకు ఎంఎల్ఏ నల్లపరెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి తోకలిసి ఆయన హాజరై ప్రారంభించారు. అనంతరం గ్రామస్తులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన గ్రామస్థాయి పాలన, ప్రజల వద్దకే పరిపాలన వల్ల కేవలం గ్రామ అభివృద్ధే కాకుండా దేశస్థాయి అభివృద్ధికి తోడ్పడుతుందన్నారు. పున్నూరు గ్రామంలో రూ.40 లక్షలతో సచివాల భవనాన్ని నిర్మించి ప్రారంభించడం గ్రామస్తులకు ఎంతో ఉపయోగకరమన్నారు. త్వరలోనే ఆర్‌బికె భవనం ప్రారంభిస్తారని తెలిపారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు మావులూరు శ్రీనివాసులరెడ్డి, రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ గొల్లపల్లి విజయ్ కుమార్ యాదవ్, యువనేత దువ్వూరు కళ్యాణ్ రెడ్డి, జెడ్‌పి వైస్ చైర్మన్ శ్రీహరికోట జయలక్ష్మి, గుణపాటి సురేష్ రెడ్డి, గూడూరు ప్రభాకర్ రెడ్డి, సిఐ రామకృష్ణారెడ్డి అధికారులు, వైసిపి నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రతిరైతుకూ న్యాయం చేయాలి

ప్రజాశక్తి-జలదంకి : మండలంలో కురిసిన అకాల వర్షాలతో నష్టపోయిన ప్రతి రైతుకి నష్టపరిహారం అందించాలని సిపిఎం, సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం సిపిఎం కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల రైతు సంఘం కార్యదర్శి గడ్డం మాల్యాద్రి మాట్లాడుతూ అహర్నిశలు కష్టించి రైతన్నలు పంట పండిస్తే ప్రకృతి వైపరీత్యాలలో పంట నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం అందకుండా వలంటీర్లకు బ్రాహ్మణక్రాకలో అందజేశారని ఈ విషయంపై విచారణ జరిపి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. వలంటీర్లకు, అధికారులకు అక్రమ సొమ్ము పంపిణీలో బేదాభిప్రాయాలు రావడం వల్లే అవినీతి బయటపడిందన్నారు. సిపిఎం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తాళ్లూరు మాల్యాద్రి మాట్లాడుతూ విచారణ జరిపి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సిపిఐ నాయకులు దమ్ము దర్గాబాబు మాట్లాడుతూ అర్హతలు లేని వ్యక్తులకు పంటలలో నష్టపరిహారం ఎలా ఇస్తారంటూ ప్రభుత్వ తీరును ప్రశ్నించారు. కార్యక్రమంలో యానాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు చేపట్టేలా ప్రోత్సహించాలి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఆత్మకూరు మండలానికి 599 గృహాలు మంజూరయ్యాయని, ప్రతి ఒక్కరూ ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించి పూర్తి చేసుకునేలా ప్రోత్సహించాలని గృహ నిర్మాణ శాఖ డిఇ నటరాజ్ పేర్కొన్నారు. శుక్రవారం ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ ఐజాక్ ప్రవీణ్‌తో కలిసి గృహ నిర్మాణాలపై ఎఇ, సిఎల్ టిసి, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డిఇ నటరాజ్ మాట్లాడుతూ మండలంలోని 22 లేఅవుట్‌లో 599 గృహాలు మంజూరయ్యాయని, లబ్ధిదారులకు అవగాహన కల్పించి వారే సొంతంగా ఇళ్లనిర్మాణాలు చేసుకునే విధంగా చూడాలన్నారు. నీరు, విద్యుత్ తదితర వసతులు అవసరమైన 17 లేఅవుట్లను గుర్తించామని, త్వరలో ఏర్పాటు చేస్తామన్నారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ప్రతి లేఅవుట్ పరిధిలో నిర్మాణాలు త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వారి వెంట హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ శరత్ తదితరులున్నారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

నిరసన చేపడుతున్న నాయకులు

ప్రజాశక్తి-మర్రిపాడు

మండలంలో విలువ కలిగిన ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతున్నా రెవెన్యూ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని పలువురు రైతు సంఘాల నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం నాయకులు సిపిఎం ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మంగల పుల్లయ్య మాట్లాడుతూ మండలంలోని ఇర్లపాడు రెవెన్యూలో ఇసుకపల్లిలో ఆ గ్రామానికి చెందిన ఎస్‌సి ఎస్‌టి బిసిలు గత 20 ఏళ్ల నుండి ప్రభుత్వ భూముల్లో ఉన్న చెట్లను తొలగించి చదును చేసి వ్యవసాయం చేసుకుంటున్నారన్నారు. మెట్ట ప్రాంతంలో వర్షాలు పడ్డ ఏడాదిలో భూములను సాగు చేస్తూ, వర్షాలు రాని ఏడాదిలో భూములు సాగు చేయడం లేదని తెలిపారు. మెతప్రాంత ప్రజలు చాలా దుర్భరమైన పరిస్థితులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. పేదలు సాగు చేస్తున్న ప్రభుత్వ భూములను రెవెన్యూ అధికారుల మాయాజాలంతో మళ్లీ మరొకరికి పట్టాలు ఇచ్చామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. పట్టాలో కలిగిన వారు జెసిబిలు ట్రాక్టర్లతో చదును చేయడంతో 20 ఏళ్ల నుండి సాగు చేస్తున్న పేదలకు మరొకరికి గొడవలు మొదలయ్యాయన్నారు. రెవెన్యూ అధికారులు చొరవ చూపి సాగు చేసుకుంటున్న పేదలకు హక్కులు కల్పించాలన్నారు. అలాగే రీ సర్వే జరిపి ఎవరైతే సాగులో ఉన్నారో వారికి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో వర్గ వైషమ్యాలకు తావు లేకుండా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి మూలి వెంగయ్య మాట్లాడుతూ మండలంలో ప్రభుత్వ భూములను రాజకీయంగా ఆర్థికంగా ఉన్న వారికే ఇస్తున్నారన్నారు. ప్రభుత్వ భూములను ఎవరు సాగు చేస్తున్నారో వారికే పట్టాలు ఇవ్వాలని ఆయన రెవెన్యూ అధికారులను కోరారు. ఇదే విషయమై పలుమార్లు తహశీల్దార్‌ను కలిసి సాగు రాయండి లేదా పట్టాలు ఇవ్వాలని వివరించామన్నారు. రాజకీయంగా పలుకుబడి కలిగిన వారికి రెవెన్యూ అధికారులు పనులు చేస్తున్నారని ఆగ్రహించారు. అక్రమంగా పట్టాలు పొందిన వారిని తొలగించే సాగులో ఉన్న వారికి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎస్‌డి రహమతుల్లా, సిఐటియు మండల కార్యదర్శి రత్నయ్య, ఐద్వా మండల కార్యదర్శి శ్యామలమ్మ, భవన నిర్మాణ కార్మిక సంఘం మండల కార్యదర్శి జాన్సన్, రైతులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఓటుహక్కు నమోదు చేయాలి

ప్రజాశక్తి-ఆత్మకూరుఅర్బన్

18 సంవత్సరాల నిండిన యువతీ యువకులను ఓటరుగా నమోదు చేయాలని, ఓటర్ల జాబితా పక్కాగా రూపొందించేందుకు అందరూ సహకారం అందించాలని అసిస్టెంట్ కలెక్టర్ విద్యాధరి అన్నారు. శుక్రవారం ఆర్‌డిఒ కార్యాలయంలో ఆర్‌డిఒ ఎస్.కరుణకుమారితో కలిసి రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటర్ల జాబితా రీవెరిఫికేషన్ చేసేందుకు 21వ తేదీ నుండి ఆగస్టు 21వ తేదీ వరకు బిఎల్ఒలు, బిఎల్ఎలు ప్రతి ఇంటికి వెళ్లి పరిశీలిస్తారని, చనిపోయిన వారి ఓటర్లు, గ్రామంలో లేని వారి ఓటర్లు తొలగిస్తారన్నారు. అంతేకాక ఒకే ఇంట్లో నివాసం వుండే వారి ఓట్లు ఒకే పోలింగ్ కేంద్రంలోకి వచ్చేందుకు సహకారం అందించాలని తెలిపారు. డబుల్ ఎంట్రీలు, జెండర్ మార్పులు తదితర వాటిని పరిశీలించి సరిచేసేందుకు అవసరమైన ధృవీకరణ పత్రాలను రాసి అందజేసేలా ప్రజలకు అవగాహన కల్పిస్తారన్నారు. ఓటర్ల జాబితా రీవెరిఫికేషన్ ప్రక్రియలో వలంటీర్ల పాత్ర ఏమాత్రం ఉండకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. రాజకీయ పార్టీల నేతలు ఈ సర్వేకు తమ పూర్తి సహకారం అందించాలని కోరారు. ప్రతి రాజకీయ పార్టీ పూర్తి లెవెల్ ఏజెంట్‌ను ఏర్పాటు చేసుకుని ఓటర్ల జాబితా వెరిఫికేషన్‌లో పాల్గొని సరిచూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైసిపి అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, ఆంధ్రా సుబ్బారెడ్డి, టిడిపి తుమ్మల చంద్రారెడ్డి, సుంకర పెంచలచౌదరి, కాంగ్రెస్ నాగరాజు, సిపిఎం పట్టణ కార్యదర్శి డేవిడ్‌రాజు, బిఎస్‌పి నందా ఓబులేసు, తదితరులు పాల్గొన్నారు.

సిఐకు ప్రశంసలు

ప్రజాశక్తి-ఉదయగిరి

జిల్లా ఎస్‌పి కె.తిరుమలేశ్వర్ రెడ్డి చేతుల మీదగా సిఐ వేల్పుల గిరిబాబు ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. శుక్రవారం నెల్లూరులోని ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా నేర సమీక్ష సమావేశంలో సిఐ గిరిబాబును జిల్లాఎస్ పి అభినందించి ప్రశంస పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల ఓ గంజాయి ముఠా క్రయ విక్రయాలు కేసులో ఆదేశాల మేరకు వైజాగ్‌లో ఆ ముఠాను చాకచక్యంగా పట్టుకొని ఉత్తమ ప్రతిభ కనపరిచినందుకు ఈ అవార్డును అందజేశారు.

పాఠ్యపుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి-సీతారామపురం

మండలంలోని 41 ప్రభుత్వ పాఠశాలలకు రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేసిన 5729 రెండవ సెమిస్టర్ పాఠ్యపుస్తకాలను పాఠశాలలకు చేర్చినట్లు ఎంఇఒ ఎస్‌కె.మస్తాన్ వలీ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 41 పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఎస్ఎంసి చైర్మన్‌ల ఆధ్వర్యంలో రెండవ సెమిస్టర్ పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో సిఆర్‌పిలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నష్టపరిహారంపై విచారణ చేపట్టాలి

ప్రజాశక్తి-జలదంకి

పంట నష్టపోయిన రైతులకు వెంటనే ప్రభుత్వం చర్యలు తీసుకుని నష్టపరిహారం అందేలా చూడాలని బిజెపి నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వడగండ్ల వానకు మండలంలోని అనేక గ్రామాల రైతులు తీవ్రంగా నష్టపోతే ఒక్క బ్రాహ్మణక్రాక రైతు భరోసా కేంద్రంలోనే నష్టపరిహారం రైతులతో పాటు అనర్హులకూ అందిందన్నారు. శుక్రవారం జలదంకిలోనే ఎంపిడిఒ కార్యాలయం ఎదుట బిజెపి మండల అధ్యక్షులు మారెళ్ళ బ్రహ్మారెడ్డి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు బుచ్చిరెడ్డి, హనుమారెడ్డి, తిరుపతిరెడ్డి, శ్రీనాథ్ రెడ్డి, రాకేష్ రెడ్డి, కంచర్ల మురళి, జనసేన నాయకులు బద్దెపూడి సుధీర్, ప్రశాంత్, హేమచంద్ర, తోట మురళి, నిమ్మలపల్లి రామ్‌చైతన్య, చక్రాల సురేష్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న మున్సిపల్ కార్మికుల దీక్ష

కావలి, ఆత్మకూరుల్లో నిరసన చేపడుతున్న మున్సిపల్ కార్మికులు

ప్రజాశక్తి-కావలి

ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర పిలుపుమేరకు మున్సిపల్ కార్మికులు రెండోరోజు శుక్రవారం మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు రిలే దీక్షలు కొనసాగించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు పసుపులేటి పెంచలయ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి పారిశుధ్య కార్మికులకు ఇచ్చిన పర్మినెంట్ హామీని ఇప్పటికైనా అమలు చేయాలని కోరారు. మున్సిపల్ కార్మికులు రెండు రోజులుగా ఆందోళన రకరకాల పద్ధతిలో కొనసాగిస్తున్నారన్నారు. 27వ తేదీ లోపల మున్సిపల్ కార్మికులను పర్మినెంట్, డైలీ కార్మికులను అవుట్‌సోర్సింగ్‌లోకి చేర్చడం, కనీస వేతనాలు అమలు చేయడం, క్లాప్ డ్రైవర్లకు రూ.18,500 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో 27వ తేదీన విధులు నిలిపి వేసి పెద్దఎత్తున మున్సిపల్ కార్యాలయాల ముట్టడిని కొనసాగిస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు జి.మధుసూదన్ రావు, యూనియన్ నాయకులు బిరదల మహేష్, తురక సీనయ్య, ఎస్ ఆనందరావు, ఒంగోలు రమేష్, శివకోటయ్య ఎం.చిన్న పాలయ్య, జలదంకి బాబు, రావినూతల తిరుపతి, క్లాప్స్ డ్రైవర్స్ డి అశోక్, ఈ ప్రసాద్, తదితర కార్మికులు పాల్గొన్నారు.

27న మున్సిపల్ కార్యాలయం ముట్టడి జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : మున్సిపల్ కార్మికులను పర్మనెంట్ చేయాలని, సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని కోరుతూ శుక్రవారం మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో రెండవరోజు మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల ఉపాధ్యక్షులు డేవిడ్‌రాజు మాట్లాడుతూ కార్మికులు శ్రమ చేస్తూ పోరాటాలకు సిద్ధమైనందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. 27న మున్సిపల్ కార్యాలయ ముట్టడి కార్మికుల పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మన హక్కులను మనం సాధించుకోవడానికి మాత్రమే అని పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు జి. నాగేంద్ర మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులుగా పనిచేస్తున్న వారిలో అందరూ అత్యంత పేద కుటుంబాలకు చెందిన ఎస్‌సి, ఎస్‌టి, బిసి వర్గాలకు చెందిన వారిమని తరతరాలుగా ఇదే పని నమ్ముకుని జీవనం కొనసాగిస్తున్నారని తెలిపారు. గతంలో ప్రతిపక్ష నేతగా ఉన్న ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని అప్పటివరకు సమాన పనికి సమాన వేతనం ఇస్తామని హామీనిచ్చారు కానీ ఇంతవరకు ఆ హామీ అమలు కాలేదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సమస్యలు పరిష్కరించేందుకు ప్రయత్నం చేయాలని మున్సిపల్ ఆర్ఐ ఖాసీంకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు అధ్యక్ష కార్యదర్శులు నాగేంద్ర, రూబిన్, సహాయ కార్యదర్శి సయ్యద్ రిజ్వాన్, ఉపాధ్యక్షులు భాస్కర్, గురవయ్య, తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి-సంగం

పొదల కూరు మండలం మహమ్మదాపురం గ్రామంలోని హాస్టల్లో పురాతన బిల్డింగును పడగొడుతూ ప్రమాదవశాత్తు స్లాబు పెచ్చులు మీద పడి చనిపోయిన సంగంకు చెందిన వెంకటేశ్వర్లు కుటుంబాన్ని దొడ్ల డైరీ యాజమాన్యం ఆదుకుంది. సంగంలో మృతి చెందిన వెంకటేశ్వర్లు నివాసానికి చేరుకుని వారి కుటుంబాన్ని పరామర్శించి వారి స్వంత నిధులు రూ.2లక్షల చెక్కును అందజేశారు. నాయకులు గోపాల్ రెడ్డి, కర్నాటి రవీంద్రా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సిఎం సభకు తరలిన నాయకులు

ప్రజాశక్తి-విడవలూరు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వెంకటగిరి సభకు శుక్రవారం వస్తుండడంతో మండల పరిధిలోని ముదివర్తి వైసిపి సీనియర్ నాయకుడు కొండూరు వెంకటసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆర్‌టిసి బస్సుల్లో బయల్దేరి వెళ్లారు. వైసిపి నాయకులు తనవెంట అధిక సంఖ్యలో వచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. వైసిపి విజయం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు.

డాక్యుమెంట్లు పోయినవి

కరిపిరెడ్డి జనార్ధన్ రెడ్డి, తండ్రి వెంకటేశ్వర్లు రెడ్డి, బృందావనం, బోగోలు, బిట్రగుంట, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా నాకు చెందిన కావలి సబ్ రిజిస్ట్రార్ రిజిస్టర్ చేయబడిన నెం.668/1998, 666/1998, 3586/2008, 3133/2008, 3134/2008, 5506/2011, 3363/2011, 4240/2015, 4243/2015, 4242/2015, 4241/2015, 1606/2011, 3362/2011, 4239/2015 నెంబర్లు గల ఒరిజినల్ రిజిస్టర్డ్ డాక్యుమెంట్లు పోయినవి. బోగోలు బజారు సెంటర్‌లో జెరాక్స్ తీయించేందుకు వెళుతుండగా ఈ డాక్యుమెంట్ తే10-02-2023 న పోయినది. దొరికినవారు నాకు చేర్చగలరు. వివరాలకు 9492336800 సెల్ నెంబరును సంప్రదించగలరు.

డాక్యుమెంట్లు పోయినవి

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, వలేటివారి పాలెం మండలం, కాకుటూరు రెవిన్యూ పరిధి సర్వేనెంబర్.424 లోని పెరుగు వెంకటేశ్వర్లు, తండ్రి పెద కోటయ్యకు చెందిన య3.03 సెంట్లు భూమికి సంబంధించిన 3150/2014 నెంబరు గల డాక్యుమెంట్ పోయినది.

కాకుటూరు గ్రామ రెవెన్యూ పరిధి సర్వే నెంబర్.425 లో పెరుగు సుశీల భర్త వెంకటేశ్వర్లుకు చెందిన య6.05 సెంట్లు భూమికి సంబంధించిన 3149/2014 నెంబరు గల డాక్యుమెంటు పోయినది.

కాకుటూరు గ్రామ సర్వే నెంబర్ 425 లో పెరుగు వెంకటేశ్వర్లు తండ్రి పెదకోటయ్యకు చెందిన య1.00 సెంట్లు భూమికి సంబంధించిన 4360/2015 నెంబరు గల డాక్యుమెంట్ పోయినది. ఈ డాక్యుమెంట్లు బొంతవారిపాలెం గ్రామం నుండి కందుకూరుకు ఆటోలో వస్తుండగా పోయినవి. దొరికినవారు ఈ క్రింది చిరునామాకు తెలుపగలరు.

ఇట్లు
పెరుగు వెంకటేశ్వర్లు, తండ్రి పెదకోటయ్య,
బొంతవారిపాలెం గ్రామం, వలేటివారిపాలెం (మం)
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా.
సెల్: 98491 98264

ప్రకటన

నా క్లయింట్ కాకు లలిత షిర్డీష, భర్త చవ్వా సతీష్‌కుమార్‌రెడ్డి, ఫ్లాట్ నెం.204, పావని ఎన్‌క్లేవ్, అపార్ట్‌మెంట్, మాగుంట లే అవుట్, నెల్లూరు నగరం వారి సంజాయిషీ మేరకు యావన్మందికి తెలియజేయటం ఏమనగా...

ఈ దిగువ షెడ్యూల్ ఆస్తిని బీరం విజయలక్ష్మి, భర్త : తిరుపతి రెడ్డి, నెల్లూరు వారి వద్ద నుండి క్రయ దస్తావేజు ద్వారా కొనుగోలు జరిపి సదరు దస్తావేజు నెం. 7320/2021, తేది : 16-7-2021, ఎస్ఆర్ఓ, నెల్లూరు (ఆర్.ఓ.) అయితే బీరం విజయలక్ష్మి గారు భర్త : తిరుపతిరెడ్డి గార్లు సదరు ఆస్తిని యం.డి.సలీం అహ్మద్ తండ్రి : యస్.ఎ.జలీల్ గారి వద్ద నుండి క్రయ దస్తావేజు ద్వారా కొనుగోలు జరిపి సదరు దస్తావేజు నెం. 5075/2009, తేది: 29-6-2009 ఎస్.ఆర్.ఓ. నెల్లూరు. అయితే యం.డి.సలీమ్ అహ్మద్ గారు సదరు ఆస్తిని మన్నెం అమర్‌నాథ్‌రెడ్డి గారి వద్ద క్రయ దస్తావేజు ద్వారా కొనుగోలు జరిపి సదరు దస్తావేజు నెం. 7404/1991 తేది : 26-10-1991 ఎస్ఆర్ఓ నెల్లూరు. అయితే మన్నెం అమరనాథ్‌రెడ్డి గారు వారి కుటుంబ జాయింట్ ఆస్తులను వారి సోదరులు, తండ్రి గారు కలిసి నెల్లూరు సబార్డినేట్ జడ్జివారి కోర్టులో ఓ.యస్.నెం. 125/1989గా వేసియున్న పంపక దావాలో వాది ప్రతివాది ఐ.ఎ. నెం. 284/1991 దాఖలు చేసి రాజీనామా పిటీషన్ ప్రకారం సదరు కోర్టువారు ది.28-3-1991 ఇచ్చిన రాజీనామా డిక్రీ ప్రకారం మన్నెం అమర్‌నాథ్‌రెడ్డి గారికి సంక్రమించింది.

షెడ్యూల్ ఆస్తి వివరాలు :
నెల్లూరు పొట్టిశ్రీరాములు జిల్లా, నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్, నెల్లూరు బిట్-1, సర్వే నెంబర్లు 634, 635, 636 ఎల్.పి. నెం. 181/87, ఫ్లాట్ నెం. 42, విస్తీర్ణం : 288 చదరపు గజాలు యొక్క హద్దులు :
తూర్పు : 48 ఫ్లాట్, దక్షిణం : 41 ఫ్లాట్, పడమర: లే అవుట్ రోడ్డు, ఉత్తరం : 43 ఫ్లాట్ గల శ్రీహరినగర్, సమీప డోర్ నెం. 941 యొక్క ఆస్తికి సంబంధించిన పైన తెలిపిన నా క్లయింట్ "సుందరం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ - నెల్లూరు" బ్రాంచి నందు లోను పొందు చున్నారు. కావున సదరు ఆస్తిపై ఎవరికైన ఏ విధమైన అభ్యంతరాలు వున్న యెడల ఏడు (7) దినముల లోపు ఈ దిగువ మా సంతకందారుని అడ్రస్‌కి తెలియజేయగలరు. లేనియెడల ఎవరికి ఏ విధమైన అభ్యంతరాలు లేవని భావించి సదరు ఫైనాన్స్ కంపెనీ నుండి లోను పొందుట జరుగును. గడువు తర్వాత ఏ విధమైన క్లెయిమ్‌లు, అభ్యంతరాలుగాని మా క్లయింట్ లేదా రుణదాతని గాని ఏ విధంగా సిద్ధపరచజాలవని యావన్మందికి తెలియజేయుచున్నాము.

కె.దేవీ ప్రియాంక,
న్యాయవాది,
డోర్‌నెం. 19-140, ముక్కపాటి టవర్స్ ప్రక్కన,
ప్రసాదంపాడు, విజయవాడ - 521108.
ఫోన్ : 79816 74873